## క్లుప్తంగా

### నీలం సంజీవరెడ్డికి నివాళి



మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

**గార్లదిన్నె:** మండలంలోని కల్లూరులో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి 28వ వర్ధంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలకతీతంగా పలువురు నాయకులు హాజరై నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీలం సంజీవరెడ్డి ఆశయాలను కొనసాగించాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా, రాష్ట్రపతిగా, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పని చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ కోనారెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, నాయకులు ఏకే నరసింహులు, పెద్దన్న, బృందావన్ రామాంజనేయులు, చీమల కేశవయ్య, గట్టు రామక్రిష్ణారెడ్డి, సుబ్బయ్య, రమణారెడ్డి, ఆదిరెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యాత్మక గ్రామాలపై నిఘా



గుడిపాడు సర్పంచు ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన దృశ్యం

**యాడికి:** మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు సీఐ నాగార్జున రెడ్డి శనివారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలోని కోనుప్పలపాడు, తాడిపత్రిలో జరిగినటువంటి అల్లర్లు పునరావృతం కాకుండా మండలంలోని గుడిపాడులో సర్పంచు దండు సావిత్రి ఇంటివద్ద , కోనుప్పలపాడు, యాడికి, వేములపాడు, రాయలచెరువు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ అనంతరం ప్రజలకు ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు.

### పెన్షనర్ల అసోసియేషన్‌కు విరాళం



ఓబుళరెడ్డిని సన్మానిస్తున్న పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు

**తాడిపత్రి అర్బన్:** పెన్షనర్ల అసోసియేషన్‌కు ఓ విశ్రాంత అధ్యాపకుడు విరాళమిచ్చారు. శనివారం స్థానిక పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయంలో విశ్రాంత అధ్యాపకుడు ఆర్.ఓబుళరెడ్డి రూ.10 వేలను అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డికి అందజేశారు. ఈసందర్భంగా అసోసియేషన్ సభ్యులు అతడిని సన్మానించారు. పెన్షనర్ల అసోసియేషన్ సభ్యులు నరసింహులు, రామచంద్రారెడ్డి, వీరారెడ్డి, ఆదినారాయణస్వామి, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి

**గుత్తి:** విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీఓ ఢిల్లీశ్వరి హెచ్చరించారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. సీడీపీఓ మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సమయపాలన పాటించని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ఇప్పటికే మెమోలు జారీ చేశామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసినా, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ నాగమణి, సూపర్ వైజర్ నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### జేవీవీ పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న జేవీవీ నేతలు

**గుత్తి:** పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో శనివారం జేవీవీ సభ్యత్వ నమోదు పోస్టర్లను జేవీవీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు ప్రారంభించారు. జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రంగన్న, జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మాట్లాడారు. జనాల్లో అంతర్లీనంగా దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీయడమే జేవీవీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు దేశాయి నాగరాజు, రామాంజనేయులు, గురుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నమో.. ఆంజనేయ

- ఘనంగా హనుమజ్జయంతి
- కిటకిటలాడిన ఆలయాలు

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మూలవిరాట్‌కు అర్చకులు అభిషేకాలు, ఆకుపూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణల్లో కమిటీ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.



తాడిపత్రిలోని యోగి వేమన ఆశ్రమంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



శింగనమల: దుర్గాంజనేయస్వామిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు



పెద్దవడుగూరు మండలం మల్లేనిపల్లిలో రథంలో కొలువైన మూలవిరాట్‌కు పూజలు చేస్తున్న భక్తులు



పెద్దపప్పూరు మండలం కొట్టాలపల్లిలో..



యల్లనూరు మండలం చిలమకూరులో..



పామిడి: కోట వరాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం



గుత్తి: ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో అన్నదానం చేస్తున్న దృశ్యం

**తాడిపత్రి అర్బన్:** పట్టణంలోని జింకా వారి వీధిలో ఉన్న పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం విశేష అభిషేక పూజలతో పాటు పంచకుండాత్మక హనుమాత్ కవచహవనం పూజలు, యజ్ఞాలను నిర్వహించారు. పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అలాగు స్థానిక పుట్లూరు రోడ్డు, విజయనగర్‌కాలనీ, ఏటిగడ్డ ఆంజనేయస్వామి, హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి, గాజుల క్రిష్టప్ప వీధిలోని ఆంజనేయస్వామి, కడప రోడ్డులోని యోగి వేమన ఆశ్రమంలో హనుమాన్ జయంతి వేడుకలు చేపట్టారు.

**పెద్దవడుగూరు:** మండలంలోని మల్లేనిపల్లి, కోట కొండ, పెద్దవడుగూరు, లక్ష్మంపల్లి ,దిమ్మగుడి తదితర గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం అర్చకు ఆయా ఆలయాలల్లో మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. మల్లేనిపల్లిలో ప్రతి ఏటా రథోత్సవం నిర్వహించేవారు. ఈ సంవత్సరం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో భక్తులు స్వామిని దర్శించుకుని నిరాశతో వెళ్లారు. కార్యక్రమంలో స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

**యాడికి:** మండల కేంద్రంలోని చింతవనం ఆంజనేయ స్వామి, పెద్దపేట సంజీవరాయస్వామి ఆలయం, రాయలచెరువులో చందన గేట్ వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి, చందనలో ఆంజనేయ స్వామి దేవాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయల చెరువు అభయాంజనేయ స్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణం చేపట్టారు.

**పెద్దపప్పూరు:** మండల వ్యాప్తంగా అన్నిగ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమద్ జయంతి సందర్భంగా హోమాలు,భజనలు, అన్నదానకార్యక్రమాలను నిర్వహకులు నిర్వహించారు.కొట్టాలపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకస్వాములు హోమం నిర్వహించి అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను పంపిణీచేశారు.రాఘవేంద్రస్వామి భజన బృందం సభ్యులు ఆలపించిన భక్తిగీతాల పారాయణం ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది.

**గుత్తి:** గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుత్తిలోని కోటలో వెలిసిన దిడ్డి ఆంజనేయస్వామి ఆలయం, పులిగుట్ట ఆంజనేయస్వామి ఆలయం, చెరువు కట్ట ఆంజనేయస్వామి,కాల్వగడ్డ ఆంజనేయస్వామి, కందకం ఆంజనేయస్వామి, చెంబుల బావి ఆంజనేయ స్వామి, గుత్తి ఆర్ఎస్‌లోని అభయాంజనేయస్వామి, నవరూప ఆంజనేయ స్వామి, పత్తి కొండ రోడ్డు ఆంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**గుత్తి రూరల్:** మండలంలోని జక్కలచెరువు, తొండపాడు, మాముడూరు, ధర్మాపురం, ఊబిచెర్ల, ఇసురాళ్ళపల్లి, రజాపురం, చెర్లోపల్లి, అబ్బేదొడ్డి గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జక్కలచెరువు గ్రామ శివారులోని కృష్ణాపురం వీరాంజనేయ స్వామి ఆలయం పూజల అనంతరం హనుమాన్ చిత్రపటాన్ని ఊరేగించారు.

**పామిడి:** స్థానిక కోట వరాంజనేయస్వామి, దత్తాత్రేయ, పంచముఖ ఆంజనేయస్వామి, మడికట్ల ఆంజనేయస్వామి, దత్తాత్రేయ ఆలయంలోని అభయాంజనేయస్వామి, కాలాపురంలోని నెట్టికంటి చిన్న ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. కోట వరాంజనేయస్వామి, చిన్న నెట్టికంటి ఆంజనేయ స్వామి తదితర ఆలయంలోని సీతారాముల కల్యాణోత్సవం చేపట్టారు. అనంతరం హనుమాన్ ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చి రథోత్సవం నిర్వహించారు. అలాగే స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో హనుమాన్ చాలీసా పోస్టర్‌ను విడుదల చేయడంతోపాటు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**శింగనమల:** మండల కేంద్రంలోని దుర్గాంజనేయ దేవాలయం, చెన్నకేశాలయంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దుర్గాంజనేయ స్వామి దేవాలయంలో వైఎస్సార్‌సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గోవిందరాయునిపేట, మట్లగొంది, ఆకులేడు, శివపురం గ్రామాల్లో హనుమాజ్జయంతి వేడుకలను నిర్వహించారు.

**గార్లదిన్నె:** మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.

**పుట్లూరు:** హనుమజ్జయంతి సందర్భంగా పుట్లూరు, జీసీపల్లి, తక్కళ్లపల్లి, శనగలగూడూరు, మడ్డిపల్లి, రంగమనాయునిపల్లి తదితర గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

**బుక్కరాయసముద్రం:** మండలంలోని కొట్టాపల్లి, రెడ్డిపల్లి, రేగడి కొత్తూరు, బీకేఎస్ సిద్దరాంపురం, చెన్నంపల్లి, బొమ్మలాటపల్లి గ్రామాల్లో హనుమాన్ ఆలయాల్లో జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.


**యల్లనూరు:** మండలంలోని చిలమకూరు, బుక్కాపురం, తిమ్మంపల్లె, చింతకాయమందతదితర గ్రామాల్లో ఆంజనేయస్వామి జయంతి వేడుకలను ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు.



తాడిపత్రిలో పంచముఖి ఆంజనేయస్వామి



గుత్తిలోని దిడ్డి ఆంజనేయ స్వామి ఆలయంలో మూలవిరాట్



గుత్తి మండలం జక్కలచెరువులో వీరాంజనేయ స్వామి



గుత్తి మండలం పులిగుట్ట ఆంజనేయ స్వామికి పుష్పాలంకరణ



శింగనమలలో ఆంజనేయస్వామి



పుట్లూరు మండలం తక్కళ్లపల్లిలో..



బుక్కరాయసముద్రంలో ఆంజనేయస్వామి



యాడికి మండలం రాయలచెరువులో..

# ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

**గుత్తి రూరల్:** కౌంటింగ్ అనంతరం ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో శనివారం ఎస్ఐ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాల తరువాత తమ పార్టీ గెలిచిందని కవ్వింపు చర్యలకు దిగి ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి గొడవలకు దిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. అన్ని పార్టీల వారు సామరస్యంగా కలసిమెలసి ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అలాగే పోలీసు కానిస్టేబుళ్లతో గ్రామంలో కవాతు నిర్వహించారు.

**సంబరాల జోలికి వెళ్లొద్దు**

**పెద్దపప్పూరు:** ఎన్నికల ఫలితాల అనంతరం సంబరాల పేరిట టపాసులు కాల్చడం, ఊరేగింపులు, ర్యాలీలు, డీజేలు, తప్పెట్లు కొట్టడం తదితర వాటి జోలికి వెళ్లకండని ఎస్ఐ శరత్ చంద్ర సూచించారు. శనివారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన దేవునిఉప్పలపాడు, తురకపల్లి గ్రామాల్లో ఆయన సిబ్బందితో పర్యటించి ఇరుపార్టీల నాయకుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఎటువంటి సమస్య ఉన్నా ముందుగా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

**ప్రశాంతంగా ఉండాలి**

**పెద్దవడుగూరు:** కౌంటింగ్ రోజు ప్రజలందరూ ప్రశాంతంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని 25 పంచాయతీలల్లో పోలీసులు తిరుగుతుంటారని, చట్టాన్ని అతిక్రమించిన వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకరావాలన్నారు. ప్రతి గ్రామంపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా విజయోత్సవాలు నిర్వహించినా, టపాసులు కాల్చినా , అల్లర్లు చేసినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గుత్తి మండలం అబ్బేదొడ్డిలో ప్రజలకు సూచనలిస్తున్న ఎస్ఐ నబీరసూల్



పెద్దపప్పూరు మండలం తురకపల్లిలో మాట్లాడుతున్న ఎస్ఐ శరత్ చంద్ర

**15 మంది బైండోవర్**

**పామిడి:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న చేపట్టే కౌటింగ్‌ను పురస్కరించుకుని శనివారం అన్ని రాజకీయపార్టీలకు సంబంధించి 15 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ బెస్తరాజు సారథ్యంలో అదుపులోకి తీసుకున్న వారిని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఎదుట బైండోవర్ చేశారు. కౌంటింగ్ రోజు గొడవలకు పాల్పడకూడదని సూచించారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి



పరిసరాల పరిశుభ్రత పాటించాలంటూ చక్రాయిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**శింగనమల:** ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, మలేరియా రాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. శనివారం మండలంలోని చక్రాయిపేట గ్రామంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇంట్లో నీటి నిలువలను వారానికి రెండుసార్లు శుభ్రపరుచుకోవాలన్నారు. అలాగే ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో పాత డబ్బాలు, పాత టైర్లు, ప్లాస్టిక్ గ్లాస్‌లు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు మలేరియా గురించి అవగాహన కల్పించాలన్నారు. తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా ప్రజలు దోమతెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ఉమాశంకరమ్మ, జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, సిబ్బంది మద్దయ్య, గంగాధర్, శ్రీధర్‌మూర్తి, అశ్వర్థ నారాయణ, ఉమాదేవి , వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీస్ వలయంలో తాడిపత్రి

- గెలుపుపై వైఎస్సార్‌సీపీ ధీమా
- సర్వే ఫలితాలతో టీడీపీ డీలా

**తాడిపత్రిరూరల్:** మరో 48 గంటల్లో ఎన్నికల కౌటింగ్ జరుగనుంది. తాడిపత్రికి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ అనంతపురంలోని జేఎన్‌టీయులో నిర్వహించనున్నారు. అయినప్పటికీ తాడిపత్రి నియోజక వర్గంలోని నాయకులు, ప్రజల్లో ఉత్కంఠ రేగుతోంది. గత నెల 13న జరిగిన పోలింగ్‌లో వచ్చిన జన జాతర వైస్సార్‌ఆర్‌సీపీకి పట్టం కట్టనున్నాయని పరిశీలకులు అభిప్రాయం పడుతున్నారు. పెరిగిన ఓటింగ్ శాతం వైఎస్సార్‌సీపీ నాయకుల్లో గెలుపుపై ధీమాను వ్యక్తం చేయగా అదే తమ కొంప ముంచనుందని టీడీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. మరింత ముఖ్యంగా గ్రామీణ ఓటర్లు భారీగా పోలింగ్‌కు తరలి రావడం టీడీపీ నాయకులకు మింగుడు పడని పరిస్థితి. ఎందుకంటే గతంలో కంటే ఎక్కువ మంది ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం. వారిలో మహిళలు, మైనార్టీలు, వృద్ధులు అధికంగా ఉండటంతో టీడీపీ నాయకులకు నిద్రపట్టడం లేదు. ఓటింగ్ శాతం తగ్గించేందుకు చేసిన ప్రయత్నాల్లో భాగంగా టీడీపీ నాయకులు అల్లర్లు సృష్టించినా ఫలితం లేకపోయింది. కాగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వైఎస్సార్‌సీపీకే అనుకూలంగా ఉన్నట్లు ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో జేసీ ఫ్యామిలీ అంటే అనేక మంది ఉద్యోగులకు భయం ఉండేది. 2019లో ఎమ్మెల్యే పెద్దారెడ్డి విజయం సాధించడంతో ఉద్యోగుల్లో ఉన్న భయాలు పటాపంచలయ్యాయి. ఇందుకు కృతజ్ఞతతగా పోస్టల్ బ్యాలెట్ ఓటు ద్వారా వైఎస్సార్‌సీపీకి మద్దతిచ్చారని వారి మాటలను బట్టి అర్థమవుతోంది.



తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి సమీపంలో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు



తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి నివాసానికి వెళ్లే రహదారిని దిగ్బంధం చేసి బందోబస్తుగా ఉన్న పోలీసులు



ప్రభుత్వ కళాశాల మైదానంలో కుప్పలుగా ఉన్న రాళ్లను ట్రాక్టర్‌లో వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

**పోలీసు అధికారులను వెంటాడుతున్న భయం**

తాడిపత్రిలో బందోబస్తు ఉన్న పోలీసు అధికారులు, సిబ్బందికి నిద్ర పట్టడం లేదు. గతంలో పలు ఎన్నికల్లో జరిగిన హింసాత్మక సంఘటనలే వారికి గుర్తుకు వస్తున్నాయి. ఈ సారి పోలింగ్‌కు ముందు రోజు, మరుసటి రోజు జరిగిన అల్లర్లపై ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తూ దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఎస్పీ, తాడిపత్రి డీఎస్పీ, తాడిపత్రి టౌన్ సీఐతోపాటు కింది స్థాయి సిబ్బందిని సస్పెండ్ చేసింది. ఈ క్రమంలో అల్లర్లు పునరావృతం కాకుండా డీఐజీ, ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు తాడిపత్రిలో తిష్ట వేశారు. పారామిలటరీ దళాలను తాడిపత్రికి రప్పించారు. నియోజక వర్గంలో 144 సెక్షన్, 30పోలీసు యాక్ట్ అమలు చేస్తున్నారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డి, టీడీపీకి చెందిన జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇళ్ల ముందు బారికేడ్లను ఏర్పాటు చేసి ముళ్లకంచెలతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇరువురు నేతల ఇళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాళ్ల దాడులు పునరావృతం కాకుండా అల్లర్ల సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కుప్పలు కుప్పలుగా పడ్డ రాళ్లను మున్సిపల్ సిబ్బంది చేత పోలీసులు ఎత్తివేయించారు.

**నూతన ఆర్ఓగా శిరీష**

స్థానిక రాజకీయ పరిస్థితులు, అల్లర్లు, నివురుగప్పిన నిప్పులా ఉన్న శాంతి భద్రతలు, తాడిపత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఎన్నికల సంఘం తదితర కారణాలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాధ్యతల నుంచి రాంభూపాల్‌రెడ్డి తప్పుకున్నారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించడం అధికారులకు కత్తిమీద సాములా మారింది. తాడిపత్రికి ఆర్ఓగా వెళ్లడానికి ఎరూ సాహసించలేకపోయారు. చివరకు ఉరవకొండలో ఏఆర్ఓగా పనిచేస్తున్న శిరీషకు తాడిపత్రి ఆర్ఓ పోస్టింగ్ ఇచ్చారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**పుట్లూరు:** మండలంలోని పి.చింతలపల్లి ప్రాథమిక పాఠశాలలో 1996 నుంచి 2004 వరకూ చదివిన విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయురాలు నిర్మల జ్యోతి, ఎంఈఓలు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు.